RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 341 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | గురువారం, 13 జూన్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-





## పెన్షన్ దారులకు....
# రేవంత్ సర్కార్ శుభవార్త!

హైదరాబాద్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కోసం అనేక పథకాలను అమలు చేస్తుంటాయి. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు అందరికి వివిధ స్కీమ్ ను అమలు చేస్తుంటాయి. అలానే రైతులకు, మహిళలకు కూడా అనేక ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చే స్కీమ్స్ ను ప్రభుత్వాలు ప్రారంభిస్తుంటాయి. ఇది ఇలా ఉంటే.. వృద్ధులకు రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఒక్కొక్క రాష్ట్రం ఒక్కొక్క విధంగా వృద్ధులకు నగదు చెల్లిస్తుంది. అలానే ఈ పెన్షన్ లో కూడా రాష్ట్రానికో విధానం ఉంటుంది. అలానే తెలంగాణ ప్రభుత్వం కూడా వృద్ధులకు పెన్షన్ అందిస్తుంది. అయితే పెన్షన్ పొందే లబ్ధిదారులకు తాజాగా రేవంత్ రెడ్డి సర్కార్ ఓ గుడ్ న్యూస్ చెప్పింది. మరి.. ఆ వివరాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం.. ప్రస్తుతం తెలంగాణలో 60 ఏళ్లు పైబడిన వారికి పెన్షన్ ను అందిస్తున్నారు. అదే విధంగా వికలాంగులకు, వింతవులకు కూడా ప్రభుత్వం పెన్షన్ ను అందిస్తుంది. ప్రస్తుతం కాంగ్రెస్ నాలుగే వేల రూపాయల పెన్షన్ ను అందిస్తున్న సంగతి తెలిసిందే. అయితే 60 ఏళ్ల పై బడి ఎంత వయస్సు ఉన్న కూడా అందరికీ ఒకే తీరులో పెన్షన్ అందిస్తున్నారు. అయితే ఇది అన్నిరాష్ట్రాల్లో ఉన్న తీరు. అయితే తెలంగాణ ప్రభుత్వం పెన్షన్ విషయంలో కొత్త విధానానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో 70ఏళ్లు పైబడిన పెన్షన్ దారులకు, కుటుంబ పెన్షన్దారులకు అదనపు పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పే రీవిజన్ కమిషన్ సిఫారసుల మేరకు రాష్ట్ర ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నూతన ఉత్తర్వాలను ఆర్థిక శాఖ జారీ చేసింది. ఈ క్రమంలోనే పలు అంశాలను ప్రస్తావించింది. ఇక పెన్షన్ తీసుకుంటున్న వారిలో 70 నుంచి 75 ఏళ్లు పైబడిన వారికి బేసిక్ పెన్షన్ పై 15 శాతం అదనంగా ఇవ్వనున్నారు. అలానే 75 నుంచి 80 ఏళ్ల లోపు వారికి 20శాతంగా నిర్ణయించారు. అదే విధంగా 80 నుంచి 85 ఏళ్ల లోపు వారికి 30శాతం, 90 నుంచి 95 ఏళ్ల లోపు వారికి 50శాతం అదనంగా పెన్షన్ అందించనున్నారు. ఇక 95 నుంచి 100 ఏళ్ల లోపు వారికి 60శాతం, 100ఏళ్లకు పైబడిన పెన్షనర్లకు, కుటుంబ పెన్షన్దారులకు 100శాతం అదనంగా పెన్షన్ ఇవ్వనుదని సమాచారం. మొత్తంగా ఇది పెన్షన్ దారులకు గుడ్ న్యూస్ అనే చెప్పాలి. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుంది. ముఖ్యంగా మహిళకు ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల గ్యాస్ ను అందిస్తున్నారు.

# 24 నుంచి లోక్‌సభ.. 27 నుంచి రాజ్యసభ సమావేశాలు



కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. మోదీ 3.0 కేబినెట్‌లో 71 మంది ఎంపీలకు మంత్రులుగా అవకాశం దక్కింది. వీరంతా తమ బాధ్యతలను కూడా స్వీకరించారు. ఈ క్రమంలో లోక్‌సభ కార్యకలాపాలు నిర్వహించేందుకు స్పీకర్‌ను ఎన్నుకోవాల్సి ఉంది. దీంతో ఇప్పుడు స్పీకర్ ఎన్నిక ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో కేంద్రం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు పిలుపునిచ్చింది. జూన్ 24వ తేదీ నుంచి జులై 3 వరకు సమావేశాలు నిర్వహించనున్నట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజుజు బుధవారం ప్రకటించారు. 18వ లోక్‌సభ మొదటి సెషన్‌ను జూన్ 24 నుంచి జులై 3వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశాల్లో కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రమాణం, స్పీకర్ ఎన్నిక ఉంటుందని తెలిపారు. ఇక రాజ్యసభ జూన్ 27వ తేదీ నుంచి మొదలై జులై 3 వరకూ కొనసాగనున్నట్లు ప్రకటించారు. జూన్ 27 ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ప్రసంగించనున్నారు. ఈ ప్రసంగంలో రానున్న ఐదేళ్లలో ప్రభుత్వం చేయబోయే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి వెల్లడించనున్నట్లు తెలిసింది. రాష్ట్రపతి ప్రసంగం తర్వాత ప్రధాని మోదీ తన మంత్రి మండలిని పార్లమెంట్‌కు పరిచయం చేయనున్నట్లు కిరెణ్ రిజుజు తెలిపారు. ఆ తర్వాత రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు ప్రధాని మోదీ సమాధానం ఇవ్వనున్నారు. ఈ చర్చలో వివిధ అంశాలపై ఎన్డీయే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్ష పార్టీ నేతలు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

**స్పీకర్ ఎన్నికపై ఆసక్తి :** మోదీ 3.0 ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా ఉన్న టీడీపీ, జేడీయూ లోక్‌సభ స్పీకర్ పదవి ఆశిస్తున్నట్లు సమాచారం. సభాపతి పదవి తమకు ఇవ్వాలని అధికార బీజేపీ మిత్ర పక్షాలైన టీడీపీ, జేడీయూ పట్టుబడుతున్నాయి.

బీజేపీ ఎంపీ పురంధేశ్వరి, టీడీపీ ఎంపీ హరీశ్ మాథుర్ స్పీకర్ రేసులో ఉన్నట్టు వార్తలొస్తున్నాయి. అయితే, ఇదే సమయంలో రాజస్థాన్ కోటా నుంచి లోక్‌సభకు ఎన్నికైన ప్రస్తుత స్పీకర్ ఓం బిర్లాకు మరోసారి అవకాశం ఇవ్వొచ్చన్న అంచనాలూ ఉన్నాయి. దీంతో స్పీకర్ పదవి ఎవరికి దక్కొచ్చనే అంశం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# తెలంగాణ టెట్ ఫలితాలు వచ్చేశాయ్..

హైదరాబాద్: తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాలను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. టెట్ పేపర్–1లో 67.13 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 85,996 మంది అభ్యర్థుల్లో 57,725 మంది క్వాలిఫై అయ్యారు. టెట్ పేపర్–2లో 34.18 శాతం ఉత్తీర్ణులయ్యారు. 1,50,491 మందిలో అర్హత సాధించగా.. 51,443 మంది ఉత్తీర్ణత సాధించారు. 2023తో పోలిస్తే పేపర్–1లో 30.24 శాతం, పేపర్–2లో 18.88 అర్హత శాతం పెరిగింది. మరోవైపు టెట్ దరఖాస్తుదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉపశమనం కలిగించింది. అర్హత సాధించని వారు వచ్చే టెట్‌కు ఉచితంగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. అర్హత సాధించిన వారు డీఎస్సీకి ఉచితంగా దరఖాస్తు చేసుకునే వీలు కల్పించింది.

ఎన్నికల కోడ్ వల్ల టెట్–2024 దరఖాస్తు ఫీజును ప్రభుత్వం తగ్గించలేకపోయింది. ఈ నేపథ్యంలో తదుపరి టెట్, డీఎస్సీ దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పించాలని నిర్ణయించింది.




# ఆంధ్రప్రదేశ్‌లో 'చంద్రోదయం'

## ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణం

బుడిబుడి నడకలతో అభివృద్ధి దిశగా అడుగులేస్తోన్న రాష్ట్రం వైకాపా అరాచక పాలకుల చేతుల్లో నలిగి పోతుంటే.. ప్రతిపక్ష నేతగా ఎదురొడ్డి నిలిచిన మేరునగ ధీరుడు చంద్రబాబు నాయుడు. ప్రజా బలంతో ఆ అక్రమార్కులతో యుద్ధం చేసి, తిరుగులేని జనామోదంతో ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. నేడు నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాజకీయ ప్రస్థానం మీ కోసం..

ఎంతో ఉత్కంఠగా సాగిన అసెంబ్లీ ఎన్నికల్లో అసాధారణ విజయం సాధించి... నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన దార్శనికుడు.. చంద్రబాబు. ఐదేళ్ల క్రితం ఎన్నికల్లో కేవలం 23 స్థానాలకు పరిమితమైన దశ నుంచి... జగన్ వంటి అరాచక, విధ్వంసకర పాలకుడికి ఎదురొడ్డి పోరాడి, చంద్రబాబు అద్భుత విజయం సాధించారు. మిత్రపక్షాలతో కలసి 164 స్థానాలు గెలుచుకుని నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. నవ్యాంధ్ర సారథిగా పాలనా పగ్గాలు స్వీకరించారు. 1978లో 28 ఏళ్ల వయసులో ఎమ్మెల్యేగా ఎన్నికై శాసనసభలో ప్రవేశించాక ఇప్పటి వరకు... ఆయన 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం అత్యంత స్ఫూర్తిదాయకం. 1995లో తెదేపాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో... సెప్టెంబరు 1న ఆయన ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రెండు దఫాలు, నవ్యాంధ్రకు ఒకసారి ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన... ఇప్పుడు నాలుగోసారి సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా, పదిహేనేళ్లు ప్రతిపక్షనేతగా పనిచేయడం రాష్ట్ర చరిత్రలో ఇప్పటికీ రికార్డే! ఆయన సాధించిన విజయాల్ని తరచి చూస్తే... వాటి వెనుక ఎన్నో త్యాగాలు, అవిశ్రాంత కృషి, క్రమశిక్షణ కనిపిస్తాయి.

**విలక్షణ రాజకీయవేత్త :** సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన చంద్రబాబు చిన్నప్పటి నుంచి నాయకత్వ లక్షణాల్ని పుణికి పుచ్చుకున్నారు. యూనివర్సిటీ రాజకీయాల్లో చురుకైన పాత్ర నిర్వహించారు. 1978లో చిత్తూరు జిల్లా చంద్రగిరి నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1980లో అంజయ్య మంత్రివర్గంలో స్థానం పొందారు. 1980–83 మధ్య పురావస్తు, సినిమాటోగ్రఫీ, సాంకేతిక విద్య, పశు సంవర్థకశాఖ, పాడి పరిశ్రమాభివృద్ధి, చిన్ననీటి పారుదల వంటి శాఖల్ని సమర్థంగా నిర్వహించారు. ఎన్టీఆర్ తన కుమార్తె భువనేశ్వరితో ఆయనకు వివాహం జరిపించారు. ఎన్టీఆర్ తెదేపాను స్థాపించాక... తొలి ఎన్నికల్లో చంద్రబాబు కాంగ్రెస్ తరఫున చంద్రగిరిలోనే పోటీచేసి ఓడిపోయారు. అనంతరం తెదేపాలో చేరి తన రాజకీయ దక్షత, సునిశిత మేధతో ఎన్టీఆర్‌కు కుడిభుజంగా మారారు. ఆగస్టు సంక్షోభంలో ఆయనకు వెన్నంటి నిలిచి, ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమంలో క్రియాశీలంగా వ్యవహరించారు. 1989లో కుప్పం నియోజకవర్గానికి మారిన ఆయన అప్పటినుంచీ అప్రతిహతంగా గెలుస్తున్నారు.

**అన్నేళ్లూ ఒకెత్తు... గడచిన ఐదేళ్లూ ఒకెత్తు :** సుదీర్ఘ రాజకీయ జీవితంలో చంద్రబాబు అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. కిందపడిన ప్రతిసారీ అంతే ఉత్సాహంతో పోరాటం ప్రారంభించి మళ్లీ గెలిచి చూపించారు. ఆయన రాజకీయ ప్రస్థానంలో మొదటి నాలుగు దశాబ్దాలు ఒకెత్తు... గడచిన ఐదేళ్లూ ఒకెత్తు. గతంలో ఎందరో కాకలు తీరిన నాయకులతో కలసి పనిచేశారు. మహామహా యోధుల్ని ఢీకొట్టారు. రాజకీయ పోరాటాలు, గెలుపోటములు ఆయనకు కొత్తకాదు. ఏమాత్రం రాజకీయ పరిపక్వత లేని జగన్ వంటి నాయకుడి ఐదేళ్ల పాలనలో... చంద్రబాబు గతంలో ఎన్నడూ లేనన్ని అవమానాలు, కక్షసాధింపులు ఎదుర్కొన్నారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారుల ఆర్థిక మూలాల్ని, ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు జగన్ ఐదేళ్లూ విశ్వప్రయత్నం చేశారు. తెదేపా నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి, అరెస్టు చేయించారు. భౌతిక దాడులు, హింసాకాండ యథేచ్ఛగా సాగాయి. జోగి రమేష్ మందీ మార్బలాన్ని వెంటేసుకుని చంద్రబాబు ఇంటిపైకే దండయాత్రకు వచ్చారు. డీజీపీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న తెదేపా కేంద్ర కార్యాలయంపై వైకాపా మూకలు దాడికి తెగబడి, విధ్వంసం సృష్టిస్తే అప్పటి ప్రభుత్వం ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదు. చంద్రబాబు వయసు, రాజకీయ అనుభవానికి కనీస గౌరవం ఇవ్వకుండా... వైకాపా ఎమ్మెల్యేలు వెకిలి మాటలు, వ్యక్తిగత దూషణలతో చెలరేగిపోతుంటే... నిరోధించాల్సిన జగన్ వెకిలి నవ్వులతో ప్రోత్సహించినా ఆయన సహించారు. చివరకు అసెంబ్లీలో తన భార్య వ్యక్తిత్వాన్నే కించపరిచేలా వ్యాఖ్యలు చేసేసరికి... సహించలేక మళ్లీ ముఖ్యమంత్రిగానే సభలో అడుగుపెడతానని శపథం చేసి బయటకు వచ్చేశారు. ఆయనపై జగన్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి... 52 రోజులు జైల్లో పెట్టినా మౌనంగా భరించారు. ఇన్ని అవమానాలు, దాడులు ఎదురైనా చెక్కుచెదరని స్థైర్యంతో పోరాడి ఈ ఎన్నికల్లో వైకాపా మూకల్ని మట్టికరిపించారు. పార్టీ చరిత్రలోనే అనన్య సామాన్యమైన విజయాన్ని నమోదుచేసి.... మరో 40 ఏళ్లకు సరిపడా పార్టీకి అవసరమైన జవసత్వాల్ని అందజేశారు.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# ఎంపీలకు ఉండే ప్రయోజనాలు ఏమిటో తెలుసా?

ఇటీవల లోక్ సభ ఎన్నికలు ముగిసిన సంగతి తెలిసిందే. పార్లమెంటులోని రెండు సభలయిన రాజ్యసభలో 250 మంది, లోక్ సభలో 545 మంది ఎంపీలు ఉంటారు. మొత్తం రెండు సభలు కలిపి 795 మంది ఎంపీలు ఉంటారు. దేశ ప్రధాని కూడా ఈ రెండు సభల్లో ఏదో ఒకదానిలో సభ్యుడై ఉండాలి. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ లోక్ సభ సభ్యుడిగా ఉన్నారు. ఇటీవల ఆయన వారణాసి నుంచి ఎంపీగా గెలుపొందారు. ఈ నేపథ్యంలో ఎంపీలకు ఉండే జీతభత్యాలు, అలవెన్సులు, ప్రత్యేక ప్రయోజనాల గురించి తెలుసుకోవడానికి అంతా ఆసక్తి చూపుతున్నారు. ఒక్కో ఎంపీకి జీతం కిం నెలకు రూ. 1,00,000 ఇస్తారు. అలాగే జీతం కాకుండా, ఎంపీలు తమ కార్యాలయ నిర్వహణకు, ఇతర ఖర్చులకు నెలకు రూ. 70,000 భత్యం అందుతుంది. ఇవి కాకుండా ఆఫీస్ ఖర్చు, స్టేషనరీ, సిబ్బంది జీతాలకు రూ. 60 వేల వరకు ఇస్తారు. పార్లమెంటరీ సమావేశాలు, పార్లమెంటు కమిటీ సమావేశాల సమయంలో ఎంపీలు ఢిల్లీలో ఉన్నప్పుడు బస, ఆహారం, ఇతర ఖర్చులకు రోజుకు రూ. 2 వేలు ఇస్తారు. ప్రతి ఎంపీకి ఢిల్లీలో నివాస సదుపాయం కల్పిస్తారు. ప్రత్యేకంగా క్వార్టర్స్ కేటాయిస్తారు. ఎంపీలకు వారి 5-సంవత్సరాల కాలంలో ప్రధాన ప్రాంతాలలో అద్దె లేకుండా వసతి కల్పిస్తారు. సీనియారిటీని బట్టి వారు బంగ్లాలు, ఫ్లాట్లు లేదా హాస్టల్ గదులు లభిస్తుంది. అధికారిక వసతికి బదులుగా నెలకు రూ. 2,00,000 గృహ భత్యాన్ని పొందొచ్చు. ఏటా ఎంపీలకు 50 వేల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, 4 వేల కిలో లీటర్ల వరకు నీటిని ఉచితంగా అందిస్తారు. ఒక్కసారి ఎంపీ అయ్యాక పదవీ కాలం ముగిశాక నెలకు రూ. 25,000 పెన్షన్ అందుతుంది. ఈ మొత్తానికి ఆ తర్వాత ప్రతి అదనపు సంవత్సరానికి నెలకు రూ. 2,000 చొప్పున ఇంక్రిమెంట్ కూడా ఉంటుంది. ఎంపీలు, వారి కుటుంబ సభ్యులకు సంవత్సరానికి 34 ఉచిత దేశీయ విమాన ప్రయాణాలు ఉంటాయి. వారు అధికారిక, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉచిత ఫస్ట్-క్లాస్ రైలు ప్రయాణాన్ని కూడా వినియోగించుకోవచ్చు. అలాగే వారి నియోజకవర్గాలలో రోడ్డు మార్గంలో ప్రయాణించేటప్పుడు రవాణా ఖర్చులను కూడా క్లెయిమ్ చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం కింద ఎంపీలు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సేవలు లభిస్తాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందొచ్చు. ఎంపీలు ఒక సంవత్సరంలో 1,50,000 ఉచిత టెలిఫోన్ కాల్స్ చేసుకోవచ్చు. వారి నివాసాలు, కార్యాలయాలలో ఉచిత హై-స్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్ సౌకర్యం కూడా ఉంటుంది.

# ప్రగతి పనులు.. పరుగు పెట్టాలిక



తాండూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రగతి పనులకు రెండు నెలలకు పైగా 'కోడ్' అడ్డం వచ్చింది. జూన్ 4న ఫలితాలు వెలువడటంతోపాటు గెలుపొందిన ఎంపీల జాబితాకు కేంద్ర ప్రభుత్వ గెజిట్ ముద్రణ పూర్తయింది. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కోడ్ ఎత్తేసింది. దీంతో ఇక జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులు వేగంగా జరిగేందుకు అవకాశం కుదిరింది. దీనికి తగినట్లుగా అధికారులు క్షేత్ర స్థాయిలో కార్యాచరణ వేగవంతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో చేపట్టాల్సిన పనులు తదితరాలపై కథనం.

రూ. 300 కోట్ల విలువైనవి

జిల్లాలో రూ. 300కోట్ల విలువ చేసే భవనాలు, రహదారులు, కాలువల వంటి నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. వీటిలో ఒక్క తాండూరులోనే రూ. 2 కోట్లతో నిర్మించిన ఆడిటోరియం, రూ. అరకోటితో నిర్మించిన విద్యుత్ డీఈఈ కార్యాలయం తదితరాలున్నాయి. ఇవి కాకుండా వికారాబాద్‌లో ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభానికి సిద్ధమవుతోంది. వీటితోపాటు రూ. 100 కోట్ల విలువైన మరికొన్ని పనులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. ః ఇక కొడంగల్‌లో అయితే రూ. వేల కోట్ల అభివృద్ధి పనులు 'కడా' ఆధ్వర్యంలో వేగవంతం కావాల్సి ఉంది.

నియోజకవర్గానికి రూ. 10 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాలోని తాండూరు, పరిగి, కొడంగల్, వికారాబాద్ నియోజక వర్గాలకు రూ. 10 కోట్ల చొప్పున ప్రత్యేక అభివృద్ధి నిధిని (ఎస్‌డీఎఫ్) ఎన్నికలకు ముందే మంజూరు చేశారు. ఇందులో రూ. కోటి వరకు తాగునీటి ఎద్దడి నివారణకు కేటాయించారు. మిగిలిన నిధులతో గ్రామాలు, పట్టణాల్లో ఎలాంటి పనులు చేపట్టాలనే విషయంలో ఎమ్మెల్యేలు ఓ స్పష్టతకు వచ్చారు. ఆ మేరకు అంచనాలను రూపొందించాలని పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీర్లను ఆదేశించారు. ఇంజినీర్లు అంచనాలు రూపొందించారు. కోడ్ ఎత్తేయడంతో అభివృద్ధి పనుల జాతర వేగవంతం కానుంది.

స్థానిక సంస్థలకు మంచి రోజులు

జిల్లాలోని 564 గ్రామ పంచాయతీలు, తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ పురపాలికల వంటి స్థానిక సంస్థల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు ప్రభుత్వానికి ఇది వరకు రూ. కోట్ల విలువ చేసే పనులకు సంబంధించిన ప్రతిపాదనలు పంపించారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో నిధుల మంజూరు జరగలేదు. దీంతో వర్షాకాలం నేపథ్యంలో చేపట్టబోయే పనులకు తాత్కాలిక బ్రేక్ పడింది. గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీ కాలం ముగిసింది. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఒక్కో అధికారి 3 నుంచి 5 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా ఉన్నారు. వీరు సైతం ఎన్నికల విధుల్లో ఉండడంతో పనులు సవ్యంగా జరగలేదు. ప్రస్తుతం కోడ్ ఎత్తేయడంతో అందరూ విధుల్లో చేరారు. ఇక పనులు వేగంగా సాగాల్సిన అవసరం ఉంది.

# నిరీక్షణ ఫలించె.. ఆశలు చిగురించే



పెద్దపల్లి : ఎనిమిదేళ్ల నిరీక్షణకు తెరపడింది. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు మార్గం సుగమమైంది. భాషా పండితులు, పీఈటీల ఉన్నతీకరణ(అప్‌గ్రేడ్) కల ఫలించింది. విద్యాశాఖ ఆదేశాలతో జిల్లా యంత్రాంగం కార్యక్షేత్రంలోకి దిగింది. పీఈటీలు, భాషా పండితుల వివరాల జాబితా రూపొందించే పనిలో నిమగ్నమ య్యారు. ఉద్యోగ విరమణ కాలపరిమితి మూడేళ్లలోపు ఉన్న వారికి తప్పనిసరి బదిలీ నుంచి మినహాయించారు. టెట్‌కు సంబంధం లేకుండా ఎస్జీటీలకు పదోన్నతి, భాషా పండితులు, పీఈటీల పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ.. పదోన్నతి ఇచ్చేలా ఉత్తర్వులు రావడంతో వారికి కాస్త ఊరట కలిగింది. ఈ నెల 22 నాటికి ప్రక్రియ పూర్తి చేసేందుకు కసరత్తు ముమ్మరం చేస్తున్నారు.

అర్హుల జాబితా కూర్పు

జిల్లాలో 2,203 మంది అన్ని కేటగిరి ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తుండగా 291 ఖాళీలున్నాయి. గతేడాది సెప్టెంబర్‌లో స్కూల్ అసిస్టెంట్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పదోన్నతులు పొందారు. దీర్ఘకాలికంగా ఒకే చోట పని చేసిన కొందరికి స్థాన చలనం కలిగింది. ఈ క్రమంలో ఎల్‌ఎఫ్‌ఎల్ (లో ఫీమేల్ లీటరసీ) పదోన్నతుల్లో లోపాలను ఎత్తిచూపుతూ ఎస్జీటీ (సెకండరీ గ్రేడ్ టీచర్)లు కోర్టును ఆశ్రయించడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో కొందరు ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొంది నష్టపోయారు. ఎట్టకేలకు ప్రభుత్వం కొత్త షెడ్యూల్ ప్రకటించడంతో ఆశలు చిగురిస్తున్నాయి. వీడిన చిక్కుముడిజిల్లాలో 100 ఎస్జీటీలకు పదోన్నతి, 112 తెలుగు పండిట్, 87 హిందీ పండిట్‌లు, 36 మంది పీఈటీలను అప్‌గ్రేడ్ చేయనున్నారు.

ముందుగా ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించనున్నారు. జిల్లాలో ఎస్జీటీలు, భాషా పండితులు, పీఈటీ వివరాలను సేకరిస్తున్నారు. జిల్లా స్థాయిలో ప్రాథమిక జాబితా రూపొందిస్తుండగా.. విద్యాశాఖ ఆదేశాల మేరకు ఖాళీలు, పదోన్నతులపై స్పష్టత రానుందని అధికారులు చెబుతున్నారు. 2015లో ఎస్జీటీలకు పదోన్నతి కల్పించగా అప్పటి నుంచి పలు కారణాలతో ముందుకు సాగడం లేదు. కోర్టులోని చిక్కుముడులన్నీ వీడిపోవడంతో కల నెరవేరింది. జాబితా రూపొందిస్తున్నాం..- మాధవి, జిల్లా విద్యాధికారి

జిల్లాలో తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్నాం. ఉపాధ్యాయులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలు, ర్యాంక్ కార్డు, నియామక పత్రం రెండు జిరాక్స్ కాపీలను సమర్పిస్తున్నారు. అర్హుల జాబితా రూపొందిస్తున్నాం.

# పౌష్టికాహారం పంపిణీపై సర్వే



గంభీరావుపేట : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా, లబ్ధిదారులకు పక్కాగా అందేలా ప్రభుత్వం ప్రత్యేక సర్వే చేపడుతుంది. దీని ద్వారా పాలు, గుడ్లు, బాలామృతం వంటివి అందడంతో పాటు తీవ్ర పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి ప్రతి నెలా బరువు, ఎత్తు వంటివి గమనించనున్నారు. ఇందు కోసం ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం (ఎన్‌హెచ్‌టీఎస్) పేరిట సర్వేను మార్చి నెల నుంచి చేపడుతుంది. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేస్తున్నారు.

జిల్లాలో సిరిసిల్ల, వేములవాడల్లో ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. వీటి పరిధిలో మొత్తం 587 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. సర్వే చేయాల్సిన కుటుంబాలు 1,36,722 ఉండగా, ప్రస్తుతం 1,21,086 కుటుంబాల సర్వే పూర్తి చేశారు. 88.56 శాతం సర్వే పూర్తయింది. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను చరవాణిలో ఉన్న యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇంటి యజమానితోపాటు కుటుంబ సభ్యులు ఎంత మంది ఉన్నారు, వారి వయసు, ఆధార్ నంబరు, పుట్టిన తేది తదితర వివరాలను నమోదు చేస్తున్నారు.

ఎన్నికలతో ఆలస్యం

సర్వేలో భాగంగా గర్భిణులు, బాలింతలు, ఆరు సంవత్సరాల లోపు చిన్నారులు, దివ్యాంగుల వివరాలను సైతం పొందుపరుస్తున్నారు. సర్వేను మార్చిలోనే ప్రారంభించినప్పటికీ అంగన్‌వాడీ కార్యకర్తలు బీఎల్‌వోలుగా విధులు నిర్వహించడం వల్ల జాప్యం చోటుచేసుకుంది. సర్వే పూర్తి చేసి వివరాలు అందించాలని జిల్లా అధికారులకు ఉన్నతాధికారులు సూచించారు. దీంతో జిల్లా అధికారులు శతశాతం పూర్తయ్యే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వేగవంతంగా వందశాతం పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇవ్వాల్సిన పాలు, కోడి గుడ్లు, బాలామృతం వంటి పోషకాహారం పక్కదారి పట్టకుండా అడ్డుకట్ట వేయడానికి సర్వే ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా ఇకపై లబ్ధిదారులకు పక్కాగా చేరుతుందని చెబుతున్నారు. గర్భిణులు రెండు చోట్ల పౌష్టికాహారం తీసుకోకుండా సర్వేతో అడ్డుకట్ట పడుతుంది.

శతశాతం పూర్తయ్యేలా చర్యలు- లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమాధికారి

జిల్లాలో ఎన్‌హెచ్‌టీఎస్ సర్వే మార్చి నెల నుంచి చేపడుతున్నాం. మధ్యలో ఎన్నికలు రావటంతో అంగన్‌వాడీ కార్యకర్తలు బీఎల్‌వోలుగా విధులు నిర్వహించటంతో కొంత మేరకు ఆలస్యం జరిగింది. 90 శాతం వరకు పూర్తి చేశాం. సర్వేపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చాం. వారికి ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేస్తున్నాం. త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలను జారీ చేశాం. వారం రోజుల్లో పూర్తి చేస్తారు.

# హడలెత్తిస్తున్న శునకాలు.. జంకుతున్న జనాలు

ఎడపల్లి: పట్టణాలు, పల్లెలు అన్న తేడా లేకుండా వీధి కుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పిల్లలు మొదలుకుని పెద్దల వరకు ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. నిత్యం ఎవరో ఒకరు శునకాల దాడికి గురవుతూనే ఉన్నారు. బాధితుల్లో కొందరు యాంటీ రేబిస్ టీకాల కోసం సమీప ప్రభుత్వ దవాఖానాలకు పరుగులు తీస్తుండగా.. మరికొందరు అవగాహన లోపంతో అందుబాటులో లభించే నాటుమందు తీసుకుంటున్నారు. ఒక్క బోధన్ డివిజన్‌లోనే గత మే నెలలో 168 కేసులు నమోదయ్యాయి.

మాంసానికి అలవాటు పడి..

ప్రస్తుతం ప్రతి గ్రామంలో కోడి మాంసం దుకాణం అందుబాటులోకి వచ్చింది. నిర్వాహకులు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేస్తుండటంతో కుక్కలు మాంసానికి అలవాటు పడుతున్నాయి. వ్యర్థాలు దొరకని సమయంలో ప్రజలపై దాడులు చేస్తున్నాయి. వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై



ఉంది. ఔషధాలు అందుబాటులో ఉన్నాయి

విద్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో, బోధన్

బోధన్ డివిజన్‌లోని ప్రభుత్వ దవాఖానాల్లో యాంటీ రేబిస్ మందులు అందుబాటులో ఉన్నాయి. కుక్కల దాడిలో గాయపడ్డ వారందరికీ సిబ్బంది సకాలంలో టీకాలు వేసి చికిత్స అందిస్తున్నారు. ఎక్కడ కూడా మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం.

బోధన్ డివిజన్‌లోని దవాఖానాల్లో గత నెలలో నమోదైన కుక్కకాటు కేసులు : బోధన్ : 144 పెగడాపల్లి : 4 రెంజల్ : 5 ఎడపల్లి : 6 వర్ని : 4 రుద్రూరు : 4

నియంత్రణ కరవు..పట్టణాలు, పల్లెల్లో శునకాల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలి. కానీ ఆచరణలో ఇది మచ్చుకైనా కనిపించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పెంపుడు, వీధి కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేయాలి. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు లేవని చెప్పొచ్చు. రోజురోజుకూ కుక్కల సంఖ్య పెరిగిపోతోంది. నియంత్రణ లేకపోవడంతో శునకాలు గుంపులుగా వీధుల్లో తిరుగుతూ జనాలపై దాడులకు పాల్పడుతున్నాయి.

గత నెల 21న కుర్నాపల్లిలో ఆడుకుంటున్న 12 ఏళ్ల బాలికపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. క్షతగాత్రురాలిని నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానాకు తరలించారు.

జూన్ 8న జిల్లాలోని జక్రాన్‌పల్లి మండలం చాంద్‌మియాబాగ్ పంచాయతీలో ఓ బాలుడిపై శునకం దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. మరోవైపు ఇతర ప్రాంతాల్లో శునకాలు చేసిన దాడుల్లో ఇద్దరు బాలురు మృతిచెందారు. ఈ నెల 5న హైదరాబాద్ మియాపూర్‌లో ఆరేళ్ల బాలుడు ఆడుకోవడానికి వెళ్లగా శునకాలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చడంతో బాలుడు మృతి చెందాడు. 8న జనగామ జిల్లా చిల్పూర్ శివారులో ఆడుకోవడానికి వెళ్లిన ఆరేళ్ల బాలుడిని శునకాలు పొలాల్లోకి ఈడ్చుకెళ్లి దాడి చేయగా.. బాలుడు చనిపోయాడు.

# రూ. కోట్లలో అక్రమం.. నోటీసులతో తాత్సారం

నిజామాబాద్: జిల్లాలోని సహకార సంఘాల్లో నిధుల దుర్వినియోగం వ్యవహారాలు ఏటా వెలుగుచూస్తున్నాయి. అనేక చోట్ల పాలకవర్గాలు ఇష్టారాజ్యంగా అక్రమాలకు తెర లేపాయి. నిర్మాణాల పేరిట అధిక వ్యయాలు చేసి దండుకున్నట్లు కొన్నిచోట్ల బయటపడితే.. పంట రుణాల బకాయిలు చెల్లించిన రైతులకు నకిలీ రసీదులిచ్చి.. ఆ డబ్బును సంఘం ఖాతాలో జమ చేయకుండా బొక్కేశారు. ఎరువులు విక్రయించగా వచ్చిన డబ్బును సైతం సొంతానికి వాడేసుకున్నట్లు ఆడిట్లలో వెలుగుచూసింది. గత అయిదేళ్లలో 23 సొసైటీల్లో అక్రమాలు జరిగాయి. ఈ ఏడాదిలోనే నాలుగు సంఘాలకు నోటీసులు జారీ అయ్యాయి. నిధుల దుర్వినియోగంతో సొసైటీలు అప్పుల ఊబిల్లో కూరుకుపోతుండగా.. వాటిని రికవరీ చేయడంతో సహకార శాఖ న్యాయపరమైన చిక్కులతో పాటు రాజకీయ ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది.

పలుకుబడితో నెట్టుకొస్తూ..

జిల్లాలోని సహకార పలు సొసైటీల్లో వెలుగుచూసిన ఉదంతాల్లో రూ. కోట్లల్లో నిధులు దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. మొదట్లో వేలు, లక్షల్లో ఉన్న అక్రమాలు, ఇప్పుడు రూ. కోట్లను చేరుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఏళ్ల తరబడిగా నిధుల వినియోగంపై విషయాలు బయటకు రాకుండా తమ పలుకుబడితో నెట్టుకొచ్చారు. ఆడిట్ చేసిన అధికారులను మచ్చిక చేసుకొని లోలోపల విషయాలు సర్దుబాటు చేసుకుంటూ వెళ్లారు. పెద్ద మొత్తంలో దుర్వినియోగం విషయాలు గుర్తించిన ఆడిట్ అధికారులు.. తమ మెడకు చుట్టుకుంటుందనే భయంతో వెలుగులోకి తెచ్చిన పరిస్థితి. బాధ్యులను గుర్తించి సర్‌ఛార్జి నోటీసులు జారీ చేస్తున్నారు. ప్రస్తుతం 11 చోట్ల విచారణ పూర్తయి.. సొత్తు వివరాలతో సర్‌ఛార్జి నోటీసులు జారీ చేసిన పరిస్థితి.

అప్పుల ఊబిలో మరికొన్ని..

అక్రమాలు వెలుగు చూసి కొన్ని సొసైటీలు అభాసుపాలైతే.. మరికొన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయి నష్టాల్లో ఉన్నాయి. జిల్లాలోని 13 సహకార సంఘాలు మార్క్‌ఫెడ్‌కు రూ. 7 కోట్ల వరకు బకాయిలున్నట్లు తెలుస్తోంది. గతంలో ఎరువులు అరువుగా దిగుమతి చేసుకొని.. వాటిని రైతులకు అమ్ముకున్నాయి. వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చకుండా.. ఇతర అవసరాలకు వాడేశాయి. దీంతో ఇప్పుడు మార్క్‌ఫెడ్ నుంచి ఎరువులు దిగుమతి చేసుకోలేని పరిస్థితి. దీనికితోడు ఆయా సొసైటీల అప్పుల విషయంలో మార్క్‌ఫెడ్ అర్బిట్రేషన్‌కు వెళ్లింది. ఈ వివాదాలను పరిష్కరించడానికి ఇద్దరు అధికారులను నియమించారు. అప్పులు నిజమే అని తేలిన క్రమంలో రికవరీ నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. పాలకవర్గాలు తీసుకుంటున్న నిర్ణయాలు.. చేస్తున్న వ్యయాలపై నిరంతర పర్యవేక్షణ, ఆడిట్ ఉండకుంటే ఇలాంటి పరిస్థితులే ఎదురవుతుంటాయి. సంఘాలు అప్పుల్లో ఉన్నా.. నిధుల దుర్వినియోగం జరిగిన ఆ ప్రాంత రైతులకు అందే సేవలపై ప్రభావం పడుతుంది.

రికవరీలో అవరోధాలు

రికవరీ చట్టాన్ని వినియోగించి అక్రమాలకు బాధ్యుల నుంచి సొమ్ము రాబట్టాలి. కానీ ఆయా సంఘాల్లో ఛైర్మన్లుగా చేసిన వారు రాజకీయ పలుకుబడితో అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి.. ఎప్పటికప్పుడు తప్పించుకుంటున్నారు.

# సింగరేణిలో బదిలీలకు కసరత్తు

గోదావరిఖని : సింగరేణిలో అధికారుల బదిలీలకు కసరత్తు మొదలైంది. ఎన్నికల కోడ్ ముగియడంతో చాలా కాలంగా ఒకే చోట పనిచేస్తున్న అధికారుల జాబితాను యాజమాన్యం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీ చేస్తుంది. మార్చినెల ముగిసిన తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో బదిలీలకు సంబంధించిన ప్రక్రియను నిలిపివేశారు. సింగరేణిలో పనిచేస్తున్న మైనింగ్, పర్సనల్, ఇంజినీరింగ్, ఐఈడీ, ఫైనాన్స్ తదితర విభాగాల్లో పనిచేసే అధికారులకు స్థానచలనం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసేవారు. లోక్‌సభ ఎన్నికలు రావడంతో కోడ్ అమలులోకి రావడంతో బదిలీల ప్రక్రియను పక్కన పెట్టిన యాజమాన్యం ఎన్నికలు ముగిసే వరకు వేచి చూసింది. ఈనెల 6తో కోడ్ ముగియడంతో యాజమాన్యం అధికారుల బదిలీలకు సంబంధించిన కసరత్తు మొదలు పెట్టింది. ఏ అధికారి ఎక్కడ ఎంత కాలం నుంచి పనిచేస్తున్నారు. అక్కడికి మరో అధికారిని బదిలీ చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. సింగరేణిలో కీలక స్థానాల్లో ఉన్న అధికారులు బదిలీలపై దృష్టి సారించిన యాజమాన్యం ఆ తర్వాత ప్రాధాన్యత లేని విభాగాల్లో బదిలీలు చేపట్టే అవకాశం ఉంది.

కీలక స్థానాల కోసం ప్రయత్నాలు

కీలక స్థానాల్లో పోస్టింగ్ కోసం కొంత మంది అధికారులు ప్రయత్నిస్తున్నారు. తమకున్న పరిచయాలతో కీలక స్థానాల్లో బాధ్యతలు చేపట్టేందుకు ఉన్నతాధికారులపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. బదిలీలకు సంబంధించిన ప్రక్రియను పూర్తిగా సీఎండీ పరిశీలించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీంతో వివిధ వర్గాలకు చెందిన కీలక వ్యక్తుల ద్వారా ప్రయత్నం చేస్తున్నారు. సింగరేణిలో కొన్ని ప్రాంతాలు కీలకంగా ఉన్నాయి. ఆయా స్థానాల్లో బాధ్యతలు చేపట్టేందుకు ఉన్నతాధికారులకు తమ వ్యక్తిగత రికార్డులు, పనితీరుకు సంబంధించిన వివరాలను పంపిస్తున్నట్లు తెలుస్తోంది.

# లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

పెద్దపల్లి : "లేఅవుట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తులను వేగంగా పరిష్కరించి ఖజానాకు అదనపు ఆదాయం సమకూర్చాలి. కబ్జాదారులకు వర్తింపజేయకుండా పూర్తిగా అర్హమైన స్థలాలకే ఈ పథకాన్ని వర్తింపజేయాలి." లేఅవుట్ల క్రమబద్ధీకరణకు మార్గం సుగమమైంది. లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) దరఖాస్తులపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగేళ్లుగా తమ భూములను క్రమబద్ధీకరించేందుకు వేచి చూస్తున్నవారి ఎదురుచూపులకు తెరదించింది. 2020లో స్వీకరించిన దరఖాస్తులకు లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశాన్ని కల్పించింది. దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ, కోర్టు ఆదేశాలున్న భూములు మినహా ఇతర లేఅవుట్లను క్రమబద్ధీకరించనున్నారు. గతంలో రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తు చేసుకున్నవారికి అవకాశం ఇవ్వనున్నారు. నగర, పురపాలికలు, పంచాయతీల పరిధిలో అక్రమ లేఅవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు ఆహ్వానించడంతో జిల్లా వ్యాప్తంగా వేలాది దరఖాస్తులు అందాయి. ఈ క్రమంలో న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు దాఖలు కావడంతో ఈ ప్రక్రియ నిలిచింది. తాజాగా ఉప ముఖ్యమంత్రి వివిధ శాఖలతో నిర్వహించిన సమీక్షలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పెండింగ్ ప్రక్రియపై కదలిక వచ్చేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు మోక్షం లభించనుంది.

ఖజానాకు కాసుల గలగల

అక్టోబర్ 30, 2020 నాడు తుది గడువు విధించిన గత ప్రభుత్వం మొత్తం జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులను స్వీకరించింది. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో 7,061 దరఖాస్తులు వచ్చాయి. పెద్దపల్లిలో–9,675, సుల్తానాబాద్‌లో- 1,500, మంథనిలో–310 కలిపి మొత్తం 18,546 దరఖాస్తులు వచ్చాయి. క్షేత్ర స్థాయిలో పరిశీలన



చేపట్టక ముందే న్యాయ స్థానంలో వ్యాజ్యం దాఖలు కావడంతో అధికారులు పక్కన పెట్టారు. క్రమబద్ధీకరణ కాని ప్లాట్లు రిజిస్ట్రేషన్లు కాకపోవడం, ఇంటి నిర్మాణానికి బ్యాంకుల నుంచి రుణాలకు అర్హత పొందకపోవడం, అధికారికంగా ప్రభుత్వ గుర్తింపు లేకపోవడంతో అనేక సమస్యలు దరఖాస్తుదారులు ఎదుర్కొన్నారు. క్రమబద్ధీకరణ ద్వారా ప్రభుత్వానికి పెద్దమొత్తంలో ఆదాయం లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అప్పట్లో రూ.వెయ్యి మాత్రమే చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. క్రమబద్ధీకరణ దరఖాస్తుల ఆహ్వాన సమయంలో పోలిస్తే ప్రస్తుతం భూముల మార్కెట్ విలువతో పాటు రిజిస్ట్రేషన్ రుసుంలు కూడా భారీగా పెరిగాయి. ఎల్ఆర్ఎస్‌తో పాటు భూములు, స్థలాల రిజిస్ట్రేషన్‌ల ద్వారా భారీగానే ఖజానాకు ఆదాయం రానుంది.

# నిత్యావసర వస్తువుల పక్కదారికి చెల్లు



కరీంనగర్ : జిల్లాలోని కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్లోని బాలికల వసతిగృహాలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ముఖ్యంగా నిత్యావసర సరకుల విషయంలో పారదర్శకతపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇప్పటి వరకు సరకుల వినియోగం, వాటి సరఫరా వంటి వివరాలను కాగితాలపై నమోదు చేస్తుండటంతో కొన్నిసార్లు వాటి విషయంలో తేడాలు, కొన్ని చోట్ల అవి పక్కదారి పడుతున్నాయి. వీటికి చెక్ పెట్టేందుకు వాటి వివరాలు కింది స్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు తెలిసేలా ప్రభుత్వం కొత్తగా యాప్ తీసుకొస్తుంది. హాస్టల్ మేనేజ్‌మెంట్ యాప్ పేరుతో దాని రూపకల్పన దాదాపు పూర్తి కావొచ్చిందని సమాచారం. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి దీన్ని వాడకంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడుతున్నారు. జిల్లాలోని కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల ప్రత్యేకాధికారులు, ప్రిన్సిపాళ్లకు, ఆయా విద్యాసంస్థల్లోని విభాగాలు నిర్వహించే బాధ్యులకు యాప్ నిర్వహణ విషయమై శిక్షణ అందించనున్నారు.

పక్కాగా పర్యవేక్షణ..

ఉమ్మడి జిల్లాలో 49 కేజీబీవీలు, 38 ఆదర్శ పాఠశాలలున్నాయి. వాటిల్లోని బాలికల వసతిగృహాలను కేజీబీవీల ప్రిన్సిపాళ్లు పర్యవేక్షిస్తున్నారు. వీటికి నిత్యావసర సరకులు, కూరగాయలు తదితర సామగ్రిని జిల్లా స్థాయిలో టెండర్లు పిలిచి గుత్తేదారులను ఎంపిక చేసి సరకులు అందిస్తున్నారు. ప్రతి రోజు వచ్చిన సరకుల ప్రారంభ నిల్వ, వినియోగించాక ముగింపు నిల్వను రికార్డుల్లో రాస్తున్నారు. ఈ విద్యాలయాల్లోని అకౌంటెంట్లు ఈ విధులను నిర్వహిస్తున్నారు. మండల, జిల్లా స్థాయి అధికారుల సందర్శనలో సదరు రికార్డులు పరిశీలిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొన్ని విద్యాలయాల్లో సరకుల కొరత, నిల్వల్లో తేడాలు వంటివి అధికారుల తనిఖీల్లో బయటపడ్డాయి. కొన్ని సార్లు సరకుల వివరాల నమోదును రాయకుండా ఉన్న సందర్భాలు వెలుగులోకి వచ్చాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టి వాటి ఉపయోగాన్ని, నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు తీసుకొస్తున్న యాప్ ద్వారా రోజూ సమగ్ర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

ఏయే వివరాలు నమోదు చేస్తారంటే..

మొదట కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్లోని మౌలిక వసతులను యాప్‌లో నమోదు చేయాలి. ఇందుకు ప్రత్యేకాధికారులు అభ్యాసం చేస్తున్నారు. నిత్యం విద్యార్థుల సంఖ్య, క్రితం రోజు ముగింపు నిల్వ, ఆ రోజు ప్రారంభ నిల్వగా పేర్కొంటూ, ఏరోజుకారోజు గుత్తేదారు అందించిన సరకుల వివరాలు, ఎంతమేర వంటలకు వినియోగించింది. రాత్రి భోజనం తర్వాత ఎంత సరకు నిల్వ ఉందో ముగింపు నిల్వలను యాప్‌లో నమోదు చేయాలి. ఈ విషయంలో తేడాలుంటే అధికారుల సందర్శనలో చర్యలుంటాయి. గుత్తేదారు సకాలంలో సరకులు తెస్తున్నారా? లేదా? అనేది ఉన్నతాధికారులు నిత్యం గమనించే అవకాశముంది. రోజు వారీ నిర్వహణలో నగదు చెల్లించాల్సి వస్తే ఆ వివరాలు కూడా నమోదు చేసేలా వీలు కల్పిస్తున్నారు.

# మట్టిమేలు పసిగట్టి.. కాసులు రాబట్టి..!



ఆలేరు : నీరులేని చెరువులు, కుంటలు అక్రమార్కులకు వరంగా మారుతున్నాయి. ప్రభుత్వ, అసైన్డు భూముల్లోనూ గుట్టు చప్పుడు కాకుండా మట్టిని తరలిస్తూ.. ఇటుక బట్టీలు, స్థిరాస్తి వ్యాపారులకు సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా కొందరు మట్టి దందా సాగిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. గుట్టలను సైతం విడిచిపెట్టడం లేదు.

నిబంధనలకు విరుద్ధంగా..

మట్టి ఉన్న చోట ఇటుక బట్టీ ఏర్పాటు చేసుకుంటే మట్టి తరలింపునకు అనుమతులు అవసరం లేదు. ఇతర ప్రాంతాల నుంచి తరలిస్తే మాత్రం నీటిపారుదల శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. క్యూబిక్ మీటరుకు కొంత సీనరేజ్ ఛార్జీ చెల్లించాల్సి ఉంటుంది. చెరువుల్లో మట్టి తవ్వకాలకు యంత్రాలు ఉపయోగించరాదు. కానీ యంత్రాల ద్వారా తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. దీంతో చెరువుల్లో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. గతంలో దూదివెంకటాపురం ఊర చెర్వు నుంచి కూడా ఇలాగే మట్టి తరలింపు చేపడితే స్థానికుల ఫిర్యాదు మేరకు సదరు వాహనాలపై రెవెన్యూ అధికారులు జరిమానా వేసిన విషయం తెలిసిందే.

ఇటుక బట్టీలకు చేరవేస్తూ..

మట్టి మాఫియా, స్థిరాస్తి వ్యాపారులు గ్రామాలకొచ్చి ఎంతో కొంత ముట్టజెప్పి అభివృద్ధి పేరిట మట్టిని తరలించుకుపోతున్నారు. జంట నగరాల శివార్లలోని కీసర లాంటి ప్రాంతాల నల్లమట్టిని ఇటుకబట్టీల వ్యాపారులకు చేరవేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తేలికపాటి ఇటుకల తయారీలో అధికంగా నల్లమట్టి వినియోగిస్తున్నారు. దానికి డిమాండ్ బాగా ఉంది. దీంతో నీటి వనరుల్లోని మట్టితో తయారు చేస్తున్న ఇటుకలకు డిమాండ్ పెరుగుతుండటంతో పరిసర ప్రాంతాల్లో అనధికార బట్టీలు పదుల సంఖ్యలో వెలుస్తున్నాయి. ఇందుకు ఆయా పార్టీల నాయకులు సంబంధిత అధికారులతో కుమ్మక్కై ఈ దందాకు తెరలేపినట్లుగా కనిపిస్తుంది. ముఖ్యంగా నీటి వనరుల్లోని మట్టికి బేరం పెడుతున్నారు. పొక్లెయిన్లతో తవ్వకాలు జరిపి రాత్రివేళ టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. నూతన వెంచర్లకు సైతం పెద్దఎత్తున రవాణా చేస్తున్నారు. ఎవరైనా అడిగితే అనుమతులు ఉన్నాయంటూ, స్థానికంగా రైతుల పొలాల్లోకి స్వల్ప సొమ్ము ద్వారా చేరవేస్తున్నట్లుగా బుకాయిస్తున్నారు. ఇటీవల బేగంపేట శివారులోని గండిచెర్వు నుంచి పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు చేరవేశారు. తాజాగా నెమిల శివారులోని ఊర చెర్వులో నీటినిల్వలు తగ్గడంతో కొన్ని రోజులుగా సమీప ఇటుకబట్టీ వ్యాపారులకు విక్రయించుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. అధికారులకు సమాచారం చేరవేసినా అంటీముంటనట్లు ఉంటున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

పటిష్ఠ నిఘా ఏర్పాటు చేస్తాం..

– దామోదర్, తహసీల్దారు, రాజపేట

ముందస్తు అనుమతి లేకుండా చెరువుల్లోని మట్టిని ఇతర ప్రాంతాలకు చేరవేయడం చట్టరీత్యా నేరం. ఈ విషయమై ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. రాత్రివేళ నిఘాను మరింత పెంచుతాం. అక్రమ రవాణాను పోలీసుల సహకారంతో నిలువరించే ప్రయత్నం చేస్తాం.




అరబ్ దేశం కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ భవనంలో మంటలు చెలరేగి 41 మంది మృతిచెందారు. వీరిలో 40 మంది భారతీయులే కావడం మరింత విషాదకరం. జీవనోపాధి కోసం సొంతవాళ్లకు దూరంగా వచ్చి ఓ కంపెనీలో పనిచేస్తున్న వీరంతా ఇలా దురదృష్టవశాత్తూ ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ మంగాఫ్ నగరంలోని ఓ ఆరు అంతస్తుల భవనంలో బుధవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ప్రమాద సమయంలో భవనంలో 160 మంది ఉన్నారు. వీరంతా ఒకే కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలిపింది. తొలుత కిచన్‌లో ప్రారంభమైన మంటలు క్షణాల్లోనే భవనమంతా వ్యాపించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో 35 మంది మంటల్లో కాలి సజీవదహనమవ్వగా.. మరో ఆరుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 40 మంది భారతీయులేనని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ప్రమాదంలో మరో 50 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో 30 మంది భారతీయులే. ఘటన జరిగిన భవనం కువైట్‌లోని అతిపెద్ద నిర్మాణ సంస్థకు చెందినదిగా తెలిసింది. ప్రమాదం జరిగిన సమయంలో భవనంలోని చాలా మంది నిద్రలో ఉన్నారు. దీంతో ప్రాణనష్టం ఎక్కువగా ఉన్నట్లు స్థానిక అధికారులు వెల్లడించారు.

**విదేశాంగ మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి :** కువైట్ అగ్ని ప్రమాద ఘటనపై భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 40 మందికి పైగా మరణించారని, మరో 50 మందికి పైగా బాధితులు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరినట్లు తెలిసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విషయం తెలిసిన వెంటనే కువైట్‌లోని భారతీయ రాయబారి ఘటనా స్థలాన్ని సందర్శించారని.. బాధితులకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ప్రమాదంపై కువైట్ అధికారుల నుంచి మరింత సమాచారం కోసం ఎదురుచూస్తున్నట్లు వెల్లడించారు.

# 'పేట'లో మరో కృషి విజ్ఞానం

గరిడేపల్లి : దేశానికి అన్నం పెట్టే అన్నదాతకు నూతన సాంకేతికతను చేరువ చేయడానికి కేంద్రం అడుగులు వేస్తోంది. దేశంలో ఇప్పటికే రైతులకు సేవలందిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రాలను మరింత విస్తృత పరచడానికి కసరత్తు చేస్తోంది. సామర్థ్యం, అభివృద్ధి, సాంకేతికత, ఉపోద్ఘాతం, సలహాలు, సూచనలతో రైతుకు పరిశోధనా ఫలాలు అందించేందుకు కృషి చేస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న కేవీకేలకు అదనంగా మరో 16 ఏర్పాటుకు సన్నద్ధమవుతోంది. సూర్యాపేట జిల్లాలోనూ కేవీకే ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించారు. ఉత్తమంగా గడ్డిపల్లి కేవీకే

1974లో అప్పటి కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు దేశ, అంతర్జాతీయ స్థాయిలో వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులను సిద్ధం చేయడానికి నూతన పథకం తీసుకురావాలని సంకల్పించింది. అందులో భాగంగానే పుదుచ్చేరిలో మొదటి కేవీకేను స్థాపించారు. తర్వాత పంచవర్ష ప్రణాళికల్లో భాగంగా పెంచుకుంటూ ఇప్పటి వరకు 731 కేవీకేలు ఏర్పాటు చేశారు. రైతులకు అందిస్తున్న సేవలకుగానూ 1996లో గడ్డిపల్లి కేవీకేకు ఉత్తమ కేవీకే అవార్డు లభించడం విశేషం.

మరిన్ని సేవలు ఇలా..

కేవీకే లక్ష్యాలను నెరవేర్చడంతో పాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ సూచించిన పథకాలు, కార్యక్రమాలను సైతం అమలు చేస్తుంది. జిల్లాలో కూరగాయలు, పండ్ల తోటలు, వరి పొలాలు సందర్శించి



సీజన్‌ల వారీగా పంటల్లో వచ్చే చీడపీడలు, లక్షణాలు, నివారణ, నీటి, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పిస్తున్నారు. దాంతో పాటు మేనేజ్, ఎన్‌ఐపీహెచ్‌ఎం, ఎన్‌ఏఏఆర్‌ఎం, ఎన్‌ఎఫ్‌ఎల్, ఎన్‌ఐఎంఎస్‌ఎంఈ, ఎస్‌ఏఎంఆర్‌టీఐ వారి ఆర్థిక సాయంతో గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ, తేనెటీగల పెంపకం, సేంద్రియ వ్యవసాయంలో మంచి పద్ధతులపై నైపుణ్య శిక్షణ ఇస్తారు. భూసార పరీక్షల ప్రాధాన్యం, పరీక్షల నిర్వహణ, ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక అమలు, వ్యాపారులు, డీలర్లు పప్పు మిల్లుల యజమానులకు అవగాహన కార్యక్రమాలు, శిక్షణలు చేపడుతున్నారు.

సిబ్బంది అనుభవం

కేవీకేలో పలువురు శాస్త్రవేత్తలు పనిచేస్తున్నారు. ఉద్యాన విభాగం, సస్యరక్షణ కీటక విభాగం, సేద్యపు విభాగం, గృహ విజ్ఞానం, విస్తరణ విభాగం, ఫిషరీస్/పశుసంవర్ధక శాస్త్రవేత్తలు ఉంటారు. మృత్తికా విభాగం, పట్టు పురుగుల శాస్త్రవేత్తలు ఆయా కేవీకేలను బట్టి కేటాయిస్తారు. వీరితో పాటు సీనియర్ సైంటిస్ట్ హెడ్ ఉంటారు.

లక్ష్యాలు, ఉద్దేశాలు:

రాష్ట్రంలో, దేశంలో పరిశోధనా కేంద్రాల్లో రూపొందించిన కొత్త వంగడాలను స్థానిక కేవీకేలలో పండిస్తారు. వాటి నాణ్యత, ప్రాంతీయ సాగుకు అనుకూలత, విశిష్టతలు, సాంకేతిక వినియోగం తదితర అంశాలపై నివేదికలు రూపొందించడం ద్వారా పరిశోధనా స్థానాలు అందించిన నూతన విత్తనాలను వినియోగంలోకి తేవడం.

పొలాల్లో సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఉత్పత్తి సామర్థ్యం పెంచడానికి అవసరమైన క్షేత్ర ప్రదర్శనలు చేయడం.

ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై రైతుల జ్ఞానం, నైపుణ్యం నవీకరించడం, జిల్లా వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడంలో సహాయ కార్యక్రమాలకు వ్యవసాయ పరిజ్ఞానానికి నాలెడ్జ్ రిసోర్స్ సెంటర్‌గా పనిచేయడం, రైతులకు ఆసక్తి ఉన్న అన్ని విభిన్న విషయాలపై వ్యవసాయ సలహాలు అందించడం.


నాణ్యమైన విత్తనాలు అందించడంతో పాటు బయట సైతం కొనుగోలు చేసే వారికి అవగాహన కల్పించడం ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందించే వీలుంటుంది.

# కొలతల తకరారు

కామారెడ్డి : పురపాలకశాఖ పారదర్శకత కోసం తెచ్చిన స్వీయ మదింపు విధానం అక్రమార్కులకు వరంగా మారింది. అనుమతులు ఒకలా పొంది.. నిర్మాణాలు మరొకలా చేపట్టి ఆన్‌లైన్‌లో ఆస్తి పన్ను మదింపు కోసం దరఖాస్తు చేసుకోగా తప్పిదాలు వెలుగుచూస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 1521 దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. పురపాలక రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి నిర్మాణాలు పరిశీలించి యజమానులు తప్పుడు కొలతలు నమోదు చేయడాన్ని గుర్తించారు.

పరిశీలనతో వెలుగులోకి అక్రమాలు

ఉమ్మడి జిల్లాలో నగర, పురపాలక సంఘాల్లో 7789 స్వీయ మదింపు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు వచ్చాయి. అందులో 6178 అర్జీలను అధికారులు ఆమోదించారు. స్వీయ కొలతలు తీసుకుని ఆన్‌లైన్‌లో సమర్పించాలని పురపాలక శాఖ సూచించగా అనేక మంది యజమా



నులు తప్పుడు కొలతలను అందజేశారు. కింది స్థాయి సిబ్బందిని మచ్చిక చేసుకోవాలని భావించారు. నగర, పురపాలికల్లో పనిచేసే రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో కాలు కదపడంతో అక్రమాలు వెలుగుచూశాయి.

భారీగా అపరాధ రుసుం

తప్పుడు కొలతలు సమర్పిస్తే మొత్తం ఆస్తి పన్ను మదింపునకు అదనంగా 25 నుంచి 100 శాతం వరకు అపరాధ రుసుం విధించే అవకాశం ఉంది. పారదర్శకత కోసం తెచ్చిన విధానాన్ని సక్రమంగా వినియోగించుకుంటే ఇబ్బందులను అధిగమించే అవకాశముంది. స్వీయ మదింపునకు స్పందన బాగానే ఉందని కామారెడ్డి బల్దియా కమిషనర్ సుజాత వెల్లడించారు. తప్పుడు కొలతలను సమర్పిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.






## బండి సంజయ్ సహా మోదీ కేబినెట్‌లోని 28 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన విషయం తెలిసిందే. 71 మంది ఎంపీలకు మంత్రులుగా అవకాశం లభించింది. అయితే, మోదీ 3.0 కేబినెట్‌లోని 71 మంది మంత్రుల్లో 28 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు తాజాగా వెల్లడైంది.

తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్‌లో చోటు దక్కించుకున్న బీజేపీ ఎంపీ బండి సంజయ్ సహా మొత్తం 28 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ తెలిపింది. ఆయా ఎంపీలు తమ ఎన్నికల నామినేషన్ సందర్భంగా దాఖలు చేసిన అఫిడవిట్లను అధ్యయనం చేసి ఈ విషయాన్ని వెల్లడించింది. 28 మందిలో 19 మందిపై హత్యాయత్నం, విద్వేష ప్రసంగం, మహిళలపై నేరాలు వంటి తీవ్రమైన నేరాలు ఉన్నట్లు తెలిపింది. ముఖ్యంగా పోర్టులు, షిప్పింగ్, వాటర్ వేస్ శాఖల సహాయ మంత్రి శంతనూ ఠాకూర్, విద్య, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సుఖాంత మజుందార్‌పై హత్యాయత్నం కేసులు ఉన్నట్లు పేర్కొంది. అదేవిధంగా శంతనూ ఠాకూర్, మజుందార్, బండి సంజయ్, సురేష్ గోపీ సహా ఐదుగురు సహాయ మంత్రులపై మహిళలపై నేరాలకు పాల్పడిన కేసులు నమోదైనట్లు అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ నివేదించింది.

## కర్ణాటకకు టెస్లా కంపెనీ.. కేంద్ర మంత్రి ఏమన్నారంటే?

న్యూఢిల్లీ: కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల మంత్రిగా హెచ్‌డీ కుమారస్వామి బాధ్యతలు చేపట్టారు. తానేమీ స్వార్థపరుడిని కాదు అని, కేవలం స్వంత రాష్ట్రం కోసం కాకుండా, యావత్ దేశం కోసం పనిచేయనున్నట్లు చెప్పారు. మంగళవారం మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆయన్ను ఓ రిపోర్టర్ ప్రశ్న వేశారు. కర్నాటకలో టెస్లాలాంటి కంపెనీలు ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించే అవకాశాలు ఉన్నాయా అని అడిగారు. దానికి మంత్రి కుమారస్వామి స్పందించారు. అవును, ఆ ఆలోచన ఉందని, ఆ కంపెనీతో చర్చిస్తామని మంత్రి కుమారస్వామి అన్నారు. కర్నాటక వరకు తాను ఆలోచించడం లేదని, తన ఫోకస్ దేశం మొత్తం ఉందని, దాని ప్రకారమే పనిచేస్తామని, నేనేమీ స్వార్థపరుడిని కాదు అని, దేశ వృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తామని మంత్రి వెల్లడించారు. టెస్లా కంపెనీ ఇండియాలో తన ప్లాంట్‌ను స్టార్ట్ చేస్తుందా లేదా అన్న డౌట్స్ చాన్నాళ్ల నుంచి ఉన్నాయి. గత ఏడాది ప్రధాని మోదీ.. అమెరికాలో టెస్లా కంపెనీకి వెళ్లి అక్కడ మస్క్‌ను కలిసిన విషయం తెలిసిందే. ఇండియాలో త్వరలోనే



టెస్లాను ప్రారంభిస్తామన్న నమ్మకాన్ని కూడా మస్క్ అన్నారు. మార్చి నెలలో భారత సర్కారు కొత్త ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీని ప్రకటించింది. దానికి ప్రకారం పన్నులను తగ్గించనున్నారు. టెస్లా లాంటి కంపెనీల నుంచి పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ ప్రయత్నాలు చేస్తున్నారు.

## తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తే ఉరుకోం: బాల్క సుమన్



హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే, మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు బాల్క సుమన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన పదేళ్ల తర్వాత తెలంగాణపై చంద్రబాబు, రేవంత్ రెడ్డి కలిసి కుట్రలు మొదలుపెట్టారని ఆరోపించారు. రిటైర్డు ఐఏఎస్ అధికారి, ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి(సీఎస్) ఆదిత్యనాథ్ దాస్‌ను తెలంగాణ నీటిపారుదల, జల వనరుల శాఖ సలహాదారుగా నియమించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. నియామకం వెనక దాగి ఉన్న రహస్యం ఏంటో చెప్పాలని, వెంటనే పదవి నుంచి ఆయన్ను తొలగించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు డైరెక్షన్‌లో రేవంత్ రెడ్డి నడుస్తున్నారంటూ బాల్క సుమన్ మండిపడ్డారు.

విభజన సమయంలో ఏపీలో కలిపిన ఏడు మండలాలపై సీఎం రేవంత్ రెడ్డి ఇంతవరకూ ఒక్క మాటా మాట్లాడలేదన్నారు. భద్రాచలం రూరల్ మండలం యటపాక, కన్నాయిగూడెం, గుండాల, పురుషోత్తపట్నం, పిచ్చుకలపాడు పంచాయతీలను రాష్ట్రంలో కలిపేలా సీఎం రేవంత్ రెడ్డి కృషి చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రయోజనాలకు ఎవరు విఘాతం కలిగించినా చూస్తూ ఊరుకోమంటూ తెలుగు రాష్ట్రాల సీఎంలను ఉద్దేశిస్తూ హెచ్చరించారు.

## రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన నైరుతి.. మరో మూడురోజులు వర్షాలు

హైదరాబాద్ : నైరుతి రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయి. వీటి ప్రభావంతో రాష్ట్రంలో వచ్చే మరో మూడురోజులపాటు మోస్తరు నంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గురు, శుక్రవారాల్లో వివిధ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆయా రోజుల్లో ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈదురుగాలులతోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని పేర్కొన్నది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురుగాలులతోపాటు వర్షాలు కురుస్తాయని పేరొన్నది.

వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా దిగువకు చేరాయి. మంగళవారం నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో అకడకడా వర్షాలు పడినట్టు వాతావరణ శాఖ తెలిపింది.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194

## టికెట్ లేని ప్రయాణికులతో వందే భారత్ రష్.. స్పందించిన రైల్వే శాఖ

సాధారణ రైళ్లు సామాన్య ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటాయి. కొందరు టికెట్ కొనుగోలు చేయకుండా ప్రయాణిస్తూ టీసీకి దొరికిపోయిన సందర్భాలు చాలానే చూశాం. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన వందేభారత్ రైలులోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉన్న వీడియో ఒకటి నెట్టింట వైరల్‌గా మారింది. అత్యాధునిక సౌకర్యాలతో రూపొందించిన ఈ రైలు.. టికెట్ కొనుగోలు చేయకుండా ప్రయాణిస్తున్న వారితో కిటకిటలాడింది. లఖ్‌నవూ నుంచి డెహ్రాడూన్ మధ్య ప్రయాణించిన వందే భారత్ రైలులో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వీడియోను షేర్ చేసిన ఓ వ్యక్తి ప్రీమియం రైలులో ఈ పరిస్థితి తలెత్తడంపై ఆందోళన వ్యక్తంచేశారు. నెటిజన్లు స్పందిస్తూ.. దేశంలో మరికొన్ని రైళ్లను నిర్మించడం లేదా బోగీలను పెంచే ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. వైరల్‌గా మారిన ఈ వీడియోపై ఉత్తర రైల్వేశాఖ స్పందించింది. ఇది పాత వీడియో అని స్పష్టంచేసింది. "కొందరు రైతులు బలవంతంగా రైలులోకి ఎక్కినప్పుడు జరిగిన సంఘటన ఇది. పాత వీడియోను ప్రస్తుతం షేర్ చేశారు. దయచేసి ఇలాంటివి ప్రచారం చేయకండి. ప్రయాణికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోండి" అని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా పేర్కొంది.




## చంద్రబాబు ప్రమాణ స్వీకార వేదికపై అనూహ్య ఘటన: తమిళిసైని హెచ్చరించిన అమిత్ షా

అమరావతి : రాష్ట్ర మూడో ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడ గన్నవరం సమీపంలోని కేసరాపల్లి ఐటీ పార్క్ వద్ద ఏర్పాటైన ఈ కార్యక్రమంలో గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్.. ఆయనతో ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయబోతోండటం విభజనాంధ్ర ప్రదేశ్‌లో ఇది రెండోసారి. మొత్తంగా నాలుగోసారి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండుసార్లు, రాష్ట్ర విభజన అనంతరం తొలిసారిగా 2014లో ప్రమాణ స్వీకారం చేశారాయన. ఇప్పుడు మళ్లీ ఈ పదవిని అందుకోబోనున్నారు. కాగా– ఈ సభా వేదికపై అనూహ్య ఘటన చోటు చేసుకుంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ మాజీ గవర్నర్, తమిళనాడుకు చెందిన బీజేపీ సీనియర్ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్ హాజరయ్యారు. ఆమె వేదిక మీదికి వచ్చిన వెంటనే అప్పటికే అక్కడ ఆసీనులై ఉన్న ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షానకు అభివాదం చేశారు. దీనికి ప్రతిగా వారిద్దరూ తమిళిసైను నవ్వుతూ పలకరించారు. ప్రతి నమస్కారం చేశారు. వారిని దాటుకుని తమిళిసై ముందుకు వెళ్లబోతోండగా.. అమిత్ షా ఆమెను వెనక్కి పిలిచారు. దీనితో ఆమె అమిత్ షా వద్దకు చేరుకున్నారు. అమిత్ షా సీరియస్‌గా ఆమెను మందలించడం కనిపించింది. వేలు చూపుతూ కోపంతో మాట్లాడారు అమిత్ షా. తమిళిసై సౌందరరాజన్ ఏదో సంజాయిషీ ఇవ్వబోతోన్నప్పటికీ– అమిత్ షా వినిపించుకోలేదు. తనకు ఎలాంటి సంజాయిషీలు చెప్పొద్దంటూ చేతులు అడ్డంగా ఊపడం కనిపించింది. వారిద్దరి సంభాషణను పక్కనే ఉన్న వెంకయ్యనాయుడు, వెనకలే కూర్చున్న కేందమంత్రి చిరాగ్ పాశ్వాన్ ఆసక్తి విన్నారు. తమిళిసై అమిత్ షా ఆగ్రహాన్ని వ్యక్తం చేయడానికి కారణాలు లేకపోలేదు. ఇటీవలే ఆమె పార్టీ అధిష్ఠానంపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. బీజేపీ తమిళనాడు రాష్ట్రశాఖలో అసాంఘిక శక్తులు కీలక పోస్టులను పొందుతున్నారంటూ వ్యాఖ్యానించారు. బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు, కోయంబత్తూరు లోక్‌సభ అభ్యర్థి అన్నామలైని ఉద్దేశించే ఆమె ఈ వ్యాఖ్యలు చేసినట్లు చెబుతున్నారు.

## విజిలెన్స్, కాగ్ రిపోర్టులు అందాయి: కాళేశ్వరం కమిషన్ చీఫ్ జస్టిస్ చంద్ర ఘోష్



హైదరాబాద్: విజిలెన్స్, కాగ్ రిపోర్టులు అందినట్లు కాళేశ్వరం విచారణ కమిషన్ చీఫ్ జస్టిస్ చంద్ర ఘోష్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఏజెన్సీలతో సమావేశమయ్యారు. అఫిడవిట్ దాఖలు చేయాల్సిందిగా వారిని ఆదేశించారు. గ్రౌండ్ రిపోర్ట్ తెలుసుకోవాలనే అఫిడవిట్ ఫైల్ చేయమన్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. చంద్రఘోష్ మాట్లాడుతూ.." టైం బౌండ్ గురించి ఏజెన్సీలందురూ చెప్తున్నారు. ప్రభుత్వం విధించిన సమయంలోపే ప్రాజెక్టు అందించినట్లు వారు చెప్పారు. ప్రాజెక్టుల నిర్మాణం, డిజైన్, నిర్వహణ గురించి పూర్తి సమాచారం ఇవ్వాలని ఏజెన్సీలను ఆదేశించా. కమిషన్‌కు ఎవరు ఏది చెప్పినా ప్రతిదీ రికార్డు రూపంలో ఉండాలి.

ఈ నెలాఖరు లోపు అఫిడవిట్ రూపంలో సమాధానం ఇవ్వాలని వారిని ఆదేశించినట్లు" ఆయన వెల్లడించారు. ఎవరి ఆదేశాల మేరకు పనులు జరిగాయనేది రికార్డు రూపంలో సమాధానం వచ్చాక వాళ్లను సైతం విచారణకు పిలుస్తామని జస్టిస్ చంద్రఘోష్ తెలిపారు. సరైన ఆధారాల కోసమే అఫిడవిట్ దాఖలు చేయమన్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. ఇప్పటి వరకు వచ్చిన వాళ్ల అఫిడవిట్ వచ్చాక.. ఇతరులను కూడా పిలుస్తామన్నారు. కొంతమంది అధికారులు రాష్ట్రంలో లేరని, వాళ్లనూ విచారణ చేస్తామన్నారు. తప్పుడు అఫిడవిట్ ఫైల్ చేసినట్లు తమ దృష్టికి వస్తే తెలిసిపోతుందని.. వారిపై తగిన చర్యలు ఉంటాయని జస్టిస్ చంద్రఘోష్ హెచ్చరించారు.

## విద్య ద్వారానే ప్రగతి సాధ్యం : హారీశ్ రావు

సిద్దిపేట : విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చినప్పుడు వారి జీవితం మారుతుంది. ప్రజా ప్రతినిధిగా మేము, ఉపాధ్యాయులు శ్రద్ధ చూపినప్పుడే వారికి మంచి జరుగుతుందని మాజీ మంత్రి హరీశ్ రావు, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. నేటి నుంచి పాఠశాలల ప్రారంభం నేపథ్యంలో సిద్దిపేట ప్రభుత్వ బాలుర పాఠశాలలో విద్యార్థులకు బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా సిద్దిపేట జిల్లా పదో తరగతి ఫలితాల్లో అగ్రస్థానంలో నిలిచింది. అభివృద్ధిలో విద్యలో ఏ రంగంలో అయినా సిద్దిపేట జిల్లా రాష్ట్రంలో అగ్రగామిగా నిలుస్తూ వస్తుందన్నారు. సిద్దిపేటలోని ప్రభుత్వ పాఠశాలలను మెరుగైన వసతులతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిది ద్దుకున్నామని చెప్పారు. అలాగే పాఠశాలలో హాస్టల్‌కి వెంటనే డైనింగ్ రూమ్ మంజూరు చేయిస్తానని హామీ ఇస్తున్నాను. కొత్తగా వచ్చిన ప్రభుత్వం కూడా మన ఊరు –మనబడి కార్యక్రమాన్ని కొనసాగించి ప్రభుత్వ పాఠశాలను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం అన్ని ప్రభుత్వం స్కూళ్లలో ఇచ్చిన మాట ప్రకారం పారిశుద్య సిబ్బందిని, ఉచిత కరెంటు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరారు. వెంటనే 25 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు నింపాలన్నారు. సిద్దిపేట జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు నా వంతు కృషి నిత్యం ఉంటుందని హామీనిచ్చారు.




## కమిషన్ల పేరుతో ప్రజల దృష్టి మరలిస్తున్నారు: మాజీమంత్రి జగదీశ్ రెడ్డి

సూర్యాపేట: విద్యుత్ కొనుగోళ్లు , కాళేశ్వరం ప్రాజెక్టుల విచారణపై మాజీమంత్రి జగదీశ్ రెడ్డి స్పందించారు. విచారణ కమిషన్లు వాటి పని అవి చేసుకుంటాయని, రాష్ట్ర ప్రభుత్వం మీడియాకు ఎందుకు లీకులు ఇస్తోందని ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరంలో నీళ్లు నిలిపి సాగు నీరు అందించకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. నీళ్లు, విద్యుత్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పత్తి విత్తనాల కొరతలో ప్రభుత్వ పెద్దల పాత్ర ఉందని, కృత్రిమ కొరత సృష్టించి వాటిని బ్లాక్‌లో విక్రయిస్తున్నారని మండిపడ్డారు. బ్లాక్ దందాలో ఓ మంత్రి పాత్ర ఉందని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. ఆధారాలు అందగానే త్వరలో పూర్తి వివరాలు ప్రజలకు వెల్లడిస్తానన్నారు. విద్యుత్ కొనుగోళ్లు, కాళేశ్వరం ప్రాజెక్టులపై విచారణ పేరుతో రైతు రుణమాఫీ అంశం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆయన దుయ్యబట్టారు. ప్రభుత్వం ఏర్పాటు చేసి ఆరు నెలలు గడిచినా ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలు దృష్టి మరల్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. తమ చేతగానితనం కప్పిపుచ్చుకునేందుకు కమిషన్ల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని ఆయన అన్నారు. ఎన్నికల కోడ్ ముగియడంతో హామీల అమలుపై ప్రజలు ప్రశ్నిస్తారనే దురుద్దేశంతోనే ఇలాంటి పనులకు దిగుతున్నారన్నారు. కాంగ్రెస్ చేసే ఆరోపణల్లో నిజం లేదనే విషయం తెసుస్తోందని.. తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే ముందు ఉన్న దుస్థితి మళ్లీ కనిపిస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసమర్థతను బీఆర్ఎస్ పార్టీ ప్రజల దృష్టికి తీసుకెళ్తుందన్నారు. కమిషన్ల విచారణ పేరుతో రైతు రుణమాఫీ అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పక్కదారి పట్టిస్తుందని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660